క్లుప్తంగా

కవి సాయంత్రం అధ్యక్షురాలిగా స్వాతికృష్ణ



మాకవరపాలెం: కవి సాయంత్రం గ్రూపు రాష్ట్ర అధ్యక్షురాలిగా భీమబోయినపాలెం గ్రామానికి చెందిన కవయిత్రి సన్నిధి స్వాతికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్‌కుమార్ శనివారం ఆమెకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా స్వాతికృష్ణ మాట్లాడుతూ కవి సాయంత్రం గ్రూపు అనేది ప్రముఖ సాహిత్య, స్వచ్ఛంద సేవా సంస్థ జనజాగృతి కళా సమితిలో అంతర్భాగమన్నారు. తెలుగు భాషా వికాసం కోసం ఔత్సాహికుల్లో సాహిత్యాన్ని మరింత పెంపొందించేందుకు ఈ గ్రూపు పనిచేస్తుందన్నారు. రెండేళ్లపాటు తన నియామకం కొనసాగుతుందని తెలిపారు.

29 మందికి క్యాన్సర్ పరీక్షలు



అడ్డసరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రోలుగుంట: విశాఖ హోమీ బాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో శనివారం అడ్డసరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంతోపాటు దిబ్బలపాలెం నుంచి వచ్చిన 29 మందికి వైద్యులు తరుణ్ ప్రసాద్, మన్సి చాందినీ రోగ పరీక్షలతోపాటు ఖరీదైన స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేశారు. వీరిలో అయిదుగురిని విశాఖ క్యాన్సర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇక్కడ రోగులకు రోలుగుంట ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు ధనలక్ష్మి జనరల్ రోగాలకు సంబంధించిన చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది చంద్రిక అభిగల్, లోవకుమారి, ప్రమిల సేవలందించారు.

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్

నర్సీపట్నం: నేరాల నియంత్రణకు ఈ నెల 5న నర్సీపట్నం మండలం గురందొరపాలెంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఎలాంటి పత్రాలు లేని 25 బైకులను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని డీఎస్పీ మోహన్ శనివారం తెలిపారు. బ్లూరో వ్యాన్ సీజ్ చేశామన్నారు. పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి వినియోగించే 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అనధికార మద్యం సీసాలు 19 సీజ్ చేశామన్నారు. ఎలక్షన్ ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా కార్డన్ సెర్చ్ పెద్ద ఎత్తున నిర్వహించామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు సక్రమంగా తాగునీరు

మాకవరపాలెం: ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రామన్నపాలెంలో శనివారం ఆయన బోర్లకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వేసవిలో ఏ గ్రామంలోనూ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలన్నారు. ఎక్కడైనా బోర్లు, తాగునీటి పథకాలు పని చేయకపోతే ప్రజలు మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



నిందితుడు నాగరాజుతో పోలీసులు

నర్సీపట్నం: మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న 20 లీటర్ల సారాను పట్టుకుని, ఒకరిని అరెస్టు చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. రోలుగుంట మండలం శరభవరం వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వడ్డిప గ్రామానికి చెందిన రాయపురెడ్డి నాగరాజు సారాతో పట్టుబడ్డాడన్నారు. ఇతడి నుంచి సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పరారైన మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు.

137 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శనివారం దాలివలసలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం 137 మందిని పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా మంచానికి పరిమితమైన ముగ్గురు ఇళ్లకు వెళ్లి వైద్యం అందించారు. బీ.పి, సుగర్ పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎం నాగమణి, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మశ్రీ దూకుడు

- చోడవరంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా ప్రజల నుంచి ఘన స్వాగతం



గుర్రంపై ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం



చోడవరం పట్టణం బోళ్లవీధిలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి స్వాగతం పలుకుతున్న మహిళలు

చోడవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ కరణం ధర్మశ్రీ దూసుకుపోతున్నారు. నిరంతరం ప్రజల్లో తిరుగుతూ మీలో ఒకడిగా..మీ కష్ట సుఖాల్లో తోడుగా ఉంటానంటూ ఇంటింటికీ వెళ్లి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. చోడవరం పట్టణంలో బోళ్లవీధి, రామ్మోహన్‌రావుపేట, చినబజార్‌వీధి, పెదబజార్‌వీధి ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడ రామాలయంలో పూజలు చేసి అక్కడ నుంచి ప్రచారాన్ని ప్రారంభించగా, పెద్ద ఎత్తున యువకులు, మహిళలు నీరాజనం పలికారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ధర్మశ్రీ వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీ ఇంటికి ఎటువంటి లంచాలు లేకుండా సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఐదేళ్ల పాలనలో చోడవరం పట్టణంలో పూర్తిగా మంచినీటి సమస్య పరిష్కరించానని, ఎంతో ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలన్నీ అభివృద్ధి చేశానని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. వలంటీర్లను పనిచేయకుండా చంద్రబాబునాయుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వల్లే పింఛన్‌దారులు సచివాలయాలకు వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎన్నికల అనంతరం మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల ద్వారానే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రచారంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంపలి ఆనందీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, డీఆర్‌యూసీ మెంబరు బొడ్డు శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ గూనూరు ధనలక్ష్మిరామకృష్ణ, గూనూరు రాజు, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి అల్లాడ భవానీ, మహిళా అధ్యక్షురాలు యర్రా దేవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- మాడుగుల మహిళా శక్తి ఏకం కావాలి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



వంటర్లపాలెం మహిళలతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని సంక్షేమాన్ని చూసి తనను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. శనివారం వంటర్లపాలెంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలతో కాసేపు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించి ఇంటింటికీ ఎంతో మేలు చేశారన్నా రు. తన తండ్రి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బాటలోనూ తాను నడుస్తూ అందరికీ అండగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. తన తండ్రి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ సేవలను గుర్తించి తనను మీ బిడ్డగా, ఒక అక్కగా, చెల్లెమ్మగా ఆదరించాలని కోరారు. మాడుగుల కోటపై వైఎస్సార్ సీపీ జెండా మూడోసారి ఎగురవేయడానికి మహిళా శక్తి అంతా ఏకతాటిపైకి రావాలన్నారు. మాడుగుల నియోజకవర్గ చరిత్రలో ఇద్దరు మహిళా అభ్యర్థులు విజయం సాధించారన్నారు. మూడో మహిళా అభ్యర్థిగా తనను బరిలో నిలిపిన సీఎం జగనన్నకు మహిళలపై ఈ ప్రాంతం ప్రజలపై ఎంత అభిమానం ఉందో తెలియకనే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

98.61 శాతం పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: మండలంలో 98.61 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాదురావు శనివారం సాయంత్రం తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ సాయంత్రం వరకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మండలంలో 11,998 పింఛన్లకు గాను 11,831 మందికి పంపిణీ చేశామన్నారు. మరో 167 మంది పింఛన్లు తీసుకోలేదన్నారు.

నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ వివరాలు.. దేవరాపల్లి మండలంలో 10,439 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 10,297 మందికి పంపిణీ చేసి 98.64 శాతం, చీడికాడ మండలంలో 8,845 మందికి గాను 8,752 మందికి పంపిణీ చేసి 98.95 శాతం పూర్తి చేశారు. కె. కోటపాడు మండలంలో 11,102 మందికిగాను 10,977 మందికి పంపిణీ చేసి 98.87 శాతం పూర్తి చేశారు. ఈ పింఛన్లను శనివారం సాయంత్రం 5 గంటల లోపు పంపిణీ చేశామని ఆయా ఎంపీడీవోలు తెలిపారు.

తాగునీటి సమస్యకు 24 గంటల్లోగా పరిష్కారం

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జగన్‌మోహన్



మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్, ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు: వేసవి దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. ఆయన అధ్యక్షతన శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో అప్పలరాజు మాట్లాడుతు గ్రామాల్లో చేతిబోర్లు, మంచి నీటి పథకాలు మరమ్మతులకు గురైతే ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా యుద్ధ ప్రాతిపదికన సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా నిబంధనలకు లోబడి సమావేశాన్ని నిర్వహించామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, వత్రి రామునాయుడు, చీపురుపల్లి అచ్చిబాబు, లెక్కల గౌతమి, గొర్రుపోటు రామలక్ష్మి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం



రహదారి పనులను చేపడుతున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట గ్రామంలో ఇరుకిరుకుగా మారిన నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారిని విస్తరించే పనులను పంచాయతీ పాలక వర్గం చేపట్టింది. కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారి పండుగ ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఇక్కడ ఆలయ రహదారిలో జేసీబీ సహాయంతో జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, ముఖ్య నాయకుడు శీలం శంకర్రావు తదితరులు విస్తరణ పనులను శనివారం ప్రారంభించారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లి నూకాలమ్మ తల్లి

- నేటి నుంచి బుచ్చెంపేటలో మహోత్సవాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



మర్రిచెట్టు ఊడలలో అమ్మవారి ఆలయం



అమ్మవారి ఎడమ భాగంలో వినాయకుడి గుడి



అమ్మవారి కుడి వైపు ఎత్తైన శివలింగం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతున్న బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగ మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లేడుపూడి పంచాయతీ బుచ్చెంపేటలో ఏటా కొత్త అమావాస్య సందర్భంగా పండగ నిర్వహిస్తుంటారు. ఆదివారం నుంచి ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. పూర్వం అమ్మవారిని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మర్రిచెట్టు ఊడల మధ్యలో కమ్మలగుడిసెలో పూజించేవారు. అమ్మవారి ప్రాంగణమంతా విషసర్పాలతో దట్టమైన అటవిని తలపించేలా ఉండేది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం స్టీలు ప్లాంటుకు ఏలేశ్వరం ప్రాజెక్టు నీటిని తరలించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 155 కిలోమీటర్ల మేర పొడవున కాలువ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లేడుపూడి వద్ద కొండ అడ్డుగా ఉండటంతో కాలువ ఏర్పాటు సాధ్యం కాలేదు. దాంతో మూడు కిలోమీటర్ల మేర పొడవున 250 అడుగుల లోతులో సొరంగం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో పలువురు కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు చేయలేక వెనుదిరిగారు. ఈ పనులు చేస్తుంటే కూలిపోవడం ఎంతో మంది కూలీలు మరణించడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అదే తరహాలో కాంట్రాక్టరు ఎం. ప్రభాకర్‌చౌదరి పూనుకుంటే ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ క్రమంలో ఒక వృద్ధుడు కనిపించి ఇక్కడ అమ్మవారు మహిమగలదని, దర్శించుకుని పనులు ప్రారంభిస్తే పూర్తవుతుందని సలహా ఇచ్చారంట. ఆ ప్రకారం సొరంగం పనులు పూర్తయితే ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నాడు. ఎడమ వైపున ఏనుగు తొండంలో వినాయక గుడి కుడి వైపున 50 అడుగులు నాగసర్పంతో కూడిన శివలింగం నిర్మించాడు. ఆలయ ప్రాంగణంలో అంజనేయ స్వామి, మహాలక్ష్మి ఇలా పలు దేవుళ్ల విగ్రహాలు నెలకొల్పారు. ఏడాదిన్నర క్రితం ఆలయ నిర్మాణ దాత ప్రభాకర్ చౌదరి మరణించడంతో పండగను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటుంటారు.

జిల్లా స్థాయి కోలాట పోటీలు రేపు

దేవరాపల్లి: మామిడిపల్లిలో నూకాలమ్మ అమ్మవారి పండగను పురస్కరించుకొని సోమవారం జిల్లా స్థాయి డీజే కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ కర్రి సూరినాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీల్లో గెలుపొందే కోలాట బృందాలకు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అదే రోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు.

గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



రాజీనామా లేఖలు చూపుతున్న దొండపూడి గ్రామ వలంటీర్లు



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిజేస్తున్న జైతవరం వలంటీర్లు



రాజీనామా చేసిన కె.నాయిడుపాలెం వలంటీర్లు

రావికమతం: మండలంలోని దొండపూడి నుంచి 20 మంది, మత్స్యవానిపాలెం నుంచి ఏడుగురు చొప్పున గ్రామ వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. వారి రాజీనామా లేఖలను ఎంపీడీవో భానోజీరావుకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి గ్రామ స్వరాజ్య పాలనకు శ్రీకారం చుట్టి వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి తమ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన సేవలందించారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక తమపై అక్కసుతో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నిత్యం నిందిస్తుండటమే కాక తన అనుయాయుల ద్వారా కోర్టు లో పిల్ వేసి, ఎలక్షన్ కమిషన్‌కు ఆదేశాలిప్పించి ప్రజా సేవకు దూరం చేశారన్నారు. దీంతో తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేసి ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటామన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో తెలిపారు.

జైతవరంలో..

చీడికాడ: జైతవరం గ్రామ సచివాలయంలో ఆరుగురు వలంటీర్లు తమ బాధ్యతలకు రాజీనామాలు చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఉమామహేశ్వరికి శనివారం వారు అందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు రెడ్డి రవి, కురచా రాము, తంగేటి చిన్నారి, కంటిపాము జ్యోతి, బొబ్బిలి గంగరాజు, మొల్లి చిన్నరమణ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ప్రజా సేవకులుగా పనిచేశామన్నారు. తమ సేవలను జీర్ణించుకోలేక టీడీపీ నేతలు గతంలో పలుమార్లు అవాకులు చవాకులు పేలినా తాము పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తమ సేవలను అడ్డుకోవడంతో తామంతా రాజీనామాలు చేశామన్నారు.

కె.పాయుడుపాలెంలో

రోలుగుంట: కె.నాయుడుపాలెం సచివాలయ పరిధిలో పది మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వీటి పత్రాలను శనివారం స్థానిక పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి నుంచి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాల గురించి వివరిస్తామన్నారు. ఎమ్మెల్యేగా ధర్మశ్రీని, అనకాపల్లి ఎంపీగా ముత్యాలనాయుడిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుగా ఇస్తామన్నారు. అంతేకాకుండా చంద్రబాబు కరోనా సమయంలో ప్రజలను పట్టించుకోకుండా హైదరాబాదులో తలదాచుకున్నారని విమర్శించారు. పవన్ కల్యాణ్‌కు పార్టీని నడిపించుకోవడం చేతకాదన్నారు. కరోనా మాదిరిగానే ఎలక్షన్ తర్వాత మరలా వీరి అడ్రస్ హైదరాబాదే అని ఎద్దేవా చేశారు.

రామాలయ స్థల దాతకు ఘన సన్మానం



అప్పారావు దంపతులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో రామాలయ నిర్మాణానికి విలువైన స్థలం అందించిన రైతు కొల్లిమల్ల అప్పారావు కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. స్థల దాత అప్పారావు, పైడితల్లమ్మల కుమారుడు అప్పలనాయుడు జ్ఞాపకార్థంగా రూ.25 లక్షల విలువైన ఐదు సెంట్లు స్థలం రామాలయ నిర్మాణానికి వితరణగా అందించారు. భీమునిపట్నం- నర్సీపట్నం రోడ్డుకు ఆనుకున్న స్థలం ఇవ్వగా, అప్పారావు దంపతులను శనివారం గ్రామ పెద్దలు సర్పంచ్ దరిమిశెట్టి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ గుద్దేటి పోతురాజు, వైస్ సర్పంచ్ గుద్దేటి శ్రీను, పాల సంఘం అధ్యక్షుడు ఒడ్డి రాము, మాజీ ఎంపీటీసీ కొప్పాక నరసింహం, బొబ్బిలి అప్పారావు, కొల్లిమల్ల ముత్యాల నాయుడు, ఒడ్డి సత్యారావు, వేపాడ అప్పలనాయుడు, కొశిరెడ్డి శ్రీనువాసరావు, బూరె రాజు, బొబ్బిలి అర్జునరావు, వెంకటస్వామి, కొశిరెడిడ్డి నాయుడు అభినందించారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలివే..



కె. లీలాప్రసాదు

మాడుగుల రూరల్: వేసవి ప్రారంభంతో ఎండ వేడిమి ఎక్కువగా ఉంది. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని కె.జె.పురం పీహెచ్‌సీ డాక్టర్ కె. లీలాప్రసాదు తెలిపారు. వడదెబ్బ లక్షణాలు, దీనికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శనివారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో సాక్షికి వివరించారు. వడదెబ్బ సోకే వ్యక్తికి చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారకస్థితిలోకి పోవడం వంటివి వంటి లక్షణా లు ఉంటాయి. తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా ఎండలో తిరగరాదు. రోడ్డు పక్కన విక్రయించే చల్లని రంగుపానీయాలు తాగకూడదు. రోడ్లు మీద కలుషిత ఆహారం తినకూడదు. వేసవిలో మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయలు ఆహారంగా తీసుకోవాలి. మద్యం సేవించ రాదు. ప్రతి ఒక్కరూ నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నలుపు మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. రోజుకు కనీ సం 15 గ్లాసులు నీరు తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహారం ఎక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవడం మంచిది. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ వంటివి తీసుకెళ్తే మంచిది. ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి.

వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలి. చల్లటి నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం అంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు ఇలాగే చేస్తుండాలి. ఫ్యాను గాని చల్లని గాలి తగిలేలా ఉంచాలి. వడదెబ్బకు గురైన వ్యక్తులకు ఉప్పు కలిపిన మజ్జిగ గాని, లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణం, లేదా ఓ.ఆర్.ఎస్. ద్రావణం తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండాకాలంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. సమీపంలో పీహెచ్‌సీ తరలించాలని వైద్యాధికారి సూచించారు.

బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద రూ.73,510 నగదు సీజ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం ఒక వ్యక్తి నుంచి రూ.73,510 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.పెందుర్తి నుంచి అనకాపల్లి వైపు ఐస్‌క్రీమ్ తరలిస్తున్న వాహనాన్ని ఎస్‌ఎస్‌టీ టీమ్ సిబ్బంది తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ అని చెప్పినా నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపించకపోవడంతో సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కేసులు



బుచ్చెయ్యపేటలో పోలీస్ కవాతు

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో ఎవరైనా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. మండలంలో సీతయ్యపేట, వడ్డాది, రాజాం, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లో తమ సిబ్బందితో ఎన్నికల కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లకు మద్యం, సారా, ఇతర తాయిలాలతో ప్రలోభాలకు గురిచేస్తే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సారా తయారీ చేసినా, గంజాయి ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు.

ఆయుర్వేద వైద్యంపై పెరిగిన ఆసక్తి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆయుర్వేద వైద్యురాలు లావణ్య

అనకాపల్లి: కరోనా వంటి విపత్కర సమయం నుంచి రోగులకు ఆయుర్వేద వైద్యంపై ఆసక్తి పెరిగిందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్మాన్ భారత్ వైద్యాలయం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. భీముని గుమ్మం రైల్వే స్టేషన్ రామాలయ ఆవరణలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సుమారు 30 ఏళ్ల కిందట వైద్యాలయం ఆవరణలో ఆయుర్వేద ఆస్పత్రిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఆయుర్వేదంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని డాక్టర్ లావణ్య తెలిపారు. వైద్య శిబిరంలో 50 మంది రోగులకు వివిధ రకాలైన వ్యాధులకు ఆయుర్వేద మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్వేద సిబ్బంది పాల్గొన్నారు.

సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో భక్తులు

మునగపాక : మండల కేంద్రంలో శనివారం రాత్రి నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంలో ఏర్పాటు చేసిన సారె ఊరేగింపు డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయం నుంచి గ్రామంలో సాగింది. నోరూరించే వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందని ఆలయ చైర్మన్ మళ్ల రామజగన్నాథం తెలిపారు. 8వ తేదీన అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.